మంగళవారం 6 ఆగస్టు 2024 5 అనంతపురం






కళ్యాణదుర్గంలో ర్యాలీ నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, స్కీం వర్కర్లు

తాగునీటి పథకాలను సంస్కరించేరా.?

కలెక్టర్ల సదస్సులో సత్యసాయి ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి ఆరా

ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఉన్న తాగునీటి పథకాల నిర్వహణ అంతా అస్తవ్యస్తంగా మారింది. మరమ్మతులు నిర్వహణ కూడా ఇబ్బందికరంగా మారుతోంది. ఇక్కడ పనిచేసే సిబ్బందికీ వేతనాలకు కూడా సక్రమంగా అందని పరిస్థితి నెలకొంది. కొన్ని పథకాలు పూర్తి స్థాయిలో శిథిలావస్థకు చేరుతుండంతో పునర్ నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది.



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 48 తాగునీటి పథకాలున్నాయి. ఇందులో ప్రధానమైనవి సత్యసాయి, శ్రీరామిరెడ్డి తాగునీటి పథకాలు ఈ రెండు ప్రాజెక్టులే సగానికిపైగా గ్రామాలకు నీటిని అందిస్తాయి. వీటికి సంబంధించి ఏడాదికి సగటున రూ.95.33 కోట్లు అవుతున్నాయి. ఇందులో రూ.33.02 కోట్లు, విద్యుత్ ఛార్జీల కింద రూ.62.37 కోట్లు నిధులు అవసరమవుతాయి. ఇవి సకాలంలో విడుదల కాకపోతుండటంతో కార్మికులకు ఐదారు నెలలుగా బకాయిలున్నాయి. అదేవిధంగా విద్యుత్ బకాయిలూ పేరుకుపోయి ఉన్నాయి. నిర్వహణకు మరమ్మతులకు నిధులు సకాలంలో విడుదల కాకపోతుండటంతో నీటి సరఫరాలోనూ తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రధానంగా సత్యసాయి తాగునీటి పథకం నిర్మాణం పూర్తయి 20 సంవత్సరాలవుతోంది. 1994లో ఈ ప్రాజెక్టును ప్రారంభించారు. 20 ఏళ్ల పూర్తయిన నేపథ్యంలో అనేక చోట్ల పైపులైన్లు, ట్యాంకులు పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. వీటిని చాలా చోట్ల పునర్ నిర్మాణం చేట్టాల్సి ఉందని ఇంజినీర్లు చెబుతున్నారు.

నిర్వహణ పనులు విడగొట్టడంతో మరిన్ని సమస్యలు

ఇది వరకు సత్యసాయి ప్రాజెక్టు మొత్తాన్ని ఎల్అండ్‌టి సంస్థ చేపట్టేంది. శ్రీరామిరెడ్డి ప్రాజెక్టు మొత్తాన్ని ఒక్క కాంట్రాక్టరుకే అప్పగించేవారు. గడిచిన ప్రభుత్వ హయాంలో పథకం వారీగా నిర్వహణ పనులను విడగొట్టి పంపకాలు చేపట్టారు. ఈ పంపకాలతో కొన్ని చోట్ల నిర్వహణ ఇష్టానుసారంగా మారిందన్న ఆరోపణలున్నాయి. ప్రధానంగా కార్మికులకు సంబంధించి పిఎఫ్ చెల్లింపులు కూడా చేయకుండా కాంట్రాక్టర్లు బిల్లులు మాత్రం డ్రా చేసారన్న ఆరోపణలున్నాయి. ఈ విషయాన్ని జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనూ చర్చించడం గమనార్హం.



కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి ప్రస్తావన

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలోనూ సత్యసాయి ప్రాజెక్టు నిర్వహణ అవస్తవ్యస్తంగా మారిందని చెప్పారు. అంతేకాకుండా ఎల్అండ్‌టిని తప్పించారని, తిరిగి ఆ సంస్థకే నిర్వహణ బాధ్యతలు అప్పగించే ఆలోచనలోనున్నట్టు వెల్లడించారు. ఇతర ప్రాజెక్టుల నిర్వహణపై ఎటువంటి నిర్ణయం తీసుకుంటారన్నది చూడాల్సి ఉంది.

స్కీం వర్కర్ల తొలగింపులు ఆపాలి

సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక జిల్లాలో జరుగుతున్న స్కీం వర్కర్ల తొలగింపులను వెంటనే ఆపాలని, ఇప్పటికే తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు నాగమణి డిమాండ్ చేశారు. ఈమేరకు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం నాడు కళ్యాణదుర్గం ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ముందుగా పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి ఆర్‌డిఒ కార్యాలయం వరకు అంగన్వాడీలు, మున్సిపల్ వర్కర్లు, సివిల్ సప్లయ్ హమాలీలు, ఆశావర్కర్లు, శ్రీరామిరెడ్డి, సత్యసాయి వాటర్ వర్కర్స్, విఒఎలు, గ్రామపంచాయతీ, పారిశుధ్య కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళ్యాణదుర్గం రెవెన్యూ డివిజన్ పరిధిలో అన్ని మండలాల్లోనూ కొత్త ప్రభుత్వం ఏర్పాటైన మరుసటి రోజు నుంచే స్కీమ్ వర్కర్లను తొలగిస్తున్నారన్నారు. ప్రధానంగా మధ్యాహ్న భోజన పథకంలో 2003 నుంచి పనిచేస్తున్న కార్మికులందరినీ తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరితోపాటు ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెట్లను తొలగిస్తున్నారన్నారు. అంగన్వాడీ, ఆశావర్కర్లను రాజీనామా చేయాలని బెదిరిస్తున్నారన్నారు. సత్యసాయి, శ్రీరామిరెడ్డి వాటర్ వర్కర్స్‌ను తొలగించాలనే ప్రయత్నం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగానే ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా కావాలనే ఆపుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పందించి స్కీంవర్కర్లపై వేధింపులు, తొలగింపులు ఆపాలని డిమాండ్ చేశారు. లేకుంటే వారి పక్షాన సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షుడు రంగనాథ్, అంగన్వాడీ యూనియన్ నాయకులు పాతక్క, తిప్పేరమ్మ, మున్సిపల్ యూనియన్ నాయకులు శివ, వన్నూరుస్వామి, హమాలీ యూనియన్ నాయకులు రామచంద్ర, ఈశ్వర్, విఒఎల సంఘం నాయకులు శ్రీనివాసులు, మారుతి, ఆశా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మావతి, మధ్యాహ్న భోజన పథకం యూనియన్ జిల్లా కోశాధికారి సరస్వతి, ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ జిల్లా నాయకులు లక్ష్మన్న, శ్రీరామిరెడ్డి యూనియన్ నాయకులు వన్నూరుస్వామి, ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీ, అరవింద్, భవిత్, ధనుష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు : డిఆర్ఒ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



అర్జీదారులో మాట్లాడుతున్న డిఆర్ఒ

అర్జీల రూపంలో ప్రజలు అందించే సమస్యల పరిష్కారంపై తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని డిఆర్ఒ రామకృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి 416 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మరింత ప్రాధాన్యతనిచ్చి త్వరితగతిన పరిష్కరించాలన్నారు. శాఖల వారీగా వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ఏ స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలను ఆ స్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు. జిల్లా కేంద్రం వరకు అర్జీదారులు రావాల్సిన అవసరం లేకుండా అధికారులు అర్జీలకు మండల స్థాయిలనే పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ సెట్ సిఇఒ అరుణ కుమారి, డీపీవో ప్రభాకర్ రావు, డీఆర్డీఏ పీడీ ఓబులమ్మ, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డా॥వెంకటేశ్వరరావుతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈక్రాప్ నమోదును వేగవంతం చేద్దాం

ప్రజాశక్తి-వజ్రకరూరు

రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది సమన్వయంతో ఈక్రాప్ నమోదు ప్రక్రియను వేగవంతం చేద్దామని ఉరవకొండ, విడపనకల్ మండలాల తహశీల్దార్లు మహబూబ్‌బాషా, సునీతాబాయి, ఉరవకొండ ఎడిఎ పద్మజ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పంట నమోదుపై రెవెన్యూ, వ్యవసాయ శాఖల క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈక్రాప్ నమోదు జాయింట్ అజమాయిషీలో ఉన్నందున 'ఈ పంట' యాప్‌లో పంట నమోదు చేయాలని సూచించారు. పంట నమోదులో సంబంధిత అధికారులు అలసత్వం వహించరాదన్నారు. అలాగే మండలంలోని రైతులు తప్పనిసరిగా అధికారులతో మాట్లాడి పంటలను నమోదు చేయించుకోవాలని సూచించారు. పంట నమోదు చేసుకోకపోతే ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలకు అర్హులు కారన్నారు. కావున ప్రతి ఒక్కరూ పంటలను నమోదు చేసుకోవాలని కోరారు. కాగా భూమిని కౌలుకు తీసుకుని సాగు చేసే రైతులు సిసిఆర్‌సి కార్డులకు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ, విడపనకల్ మండల వ్యవసాయ అధికారులు శుభకర్, పెన్నయ్య, రైతు సేవాకేంద్రాల సిబ్బంది, వీఆర్వోలు, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.


బ్రహ్మసముద్రం : ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను ఈ-క్రాప్ నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారిణి సరిత సూచించారు. ఈమేరకు మండలంలో చేపట్టిన ఈక్రాప్ నమోదును ఆమె పరిశీలించారు. ఇందులో భాగంగా ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో సాగు చేసిన వేరుశనగ, ఆముదం, కందిపంటల స్థితిగతులపై రైతులతో ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో వీఎస్‌ఏ నాగేంద్ర, రంగస్వామి, రైతులు పాల్గొన్నారు.

నార్పల : మండల వ్యాప్తంగా ఖరీఫ్-2024 కాలానికి రైతులు సాగు చేసిన పంటలను ఈక్రాప్ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి చెన్న వీరస్వామి తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం మండలంలో ఈక్రాప్ బుకింగ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా 3525 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేసినట్లు తెలిపారు. 2250 ఎకరాల్లో వేరుశనగ, 545 ఎకరాల్లో కంది, 680 ఎకరాల్లో మొక్కజొన్న, 50 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేసినట్లు వివరించారు.

ప్రధాన సమస్యలకు వెంటనే పరిష్కారం

ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి

గ్రామాల్లో నెలకొన్న ప్రధాన సమస్యలకు వెంటనే పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని కాశేపల్లి, గుత్తి అనంతపురం గ్రామాల్లో నిర్వహించిన ప్రత్యేక సమావేశాలకు ఆయన హాజరయ్యారు. ఎమ్మెల్యేగా తొలిసారి రావడంతో జెసి అస్మిత్‌రెడ్డికి ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయా గ్రామాల్లో సర్పంచులు కృష్ణారెడ్డి, మురళీధీర్‌రెడ్డి అధ్యక్షత నిర్వహించిన సమావేశాల్లో పలువురు సభ్యులు, ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ముఖ్యంగా ప్రాధాన్యతా క్రమంలో ప్రధాన సమస్యలకు వెంటనే పరిష్కారం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కొండూరు కేశవరెడ్డి, అవలాలపల్లి కేశవరెడ్డి, గంగరాజు, దివాకరరెడ్డి, కాశేపల్లి నాగేశ్వరరెడ్డి, సుంకిరెడ్డి, ప్రసాద్‌యాదవ్, జయరామిరెడ్డి, ఎంపిటిసి చిన్నగోవిందు, తింకిరెడ్డి, రామగోవిందు, ఉపేంద్ర, రమష్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ వెంకటేశ్వరమ్మ, ఎంపిడిఒ గోపీకృష్ణ, ఇంజనీర్లు సూర్యనారాయణ, మహేష్, మానస, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, ఎపిఒ పుల్లారెడ్డి, డాక్టర్ అమర్, తదితరులు పాల్గొన్నారు.

విజయ డెయిరీ ద్వారా

పాడిరైతులను ఆదుకోండి : సిపిఎం



ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రైతుల నుంచి పాల సేకరణకు గత ప్రభుత్వం అమూల్ కంపెనీతో చేసుకున్న ఒప్పందాన్ని తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఈ నెల 10నుంచి రద్దు చేయడంతో పాడి రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారని సిపిఎం జిల్లా కమిటీ తెలిపింది. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ఈ రకమైన నిర్ణయం తీసుకోవడం సరికాదని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వి. రాంభూపాల్ సోమవారం ఓ ప్రకటనలో విమర్శించారు. జిల్లాలో వందకు పైగా కేంద్రాల ద్వారా పాల సేకరణ చేయాలని అమూల్ కంపెనీ లక్ష్యంగా పెట్టుకుని 7 కేంద్రాల నుంచి పాలు సేకరిస్తుందన్నారు. ఇలా సేకరించిన పాలల్లో ప్రతి రోజు సుమారు 60 వేల లీటర్లు రాయలసీమ జిల్లాల్లోని అంగన్వాడీ కేంద్రాలకు పంపుతున్నారని తెలిపారు. అమూల్ కంపెనీతో ఒప్పందాన్ని రద్దు చేసుకోవడంతో అంగన్వాడీ కేంద్రాలకు కర్నాటక నుండి పాలను సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు వార్తలు వస్తున్నాయని, ఇది జిల్లా పాడి రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించే అంశం అన్నారు. ప్రభుత్వ విజయ డెయిరీ ద్వారా రైతులకు గిట్టుబాటు ధరను ఇచ్చి పాలను సేకరించేటట్లు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికే పశువుల ధరలతో పాటు, దానా, గడ్డి, పశువుల వైద్యం ఖర్చులు పెరిగి పాడి రైతులు నష్టాల్లో ఉన్నారన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అమూల్ డెయిరీ ద్వారా సేకరించడాన్ని అర్థాంతరంగా నిలిపివేస్తే మరింతగా పాడి రైతులు నష్టపోతారని తెలిపారు. ప్రభుత్వం దీనిపై ఆలోచించి పాడి రైతులను ఆదుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీలు

జిల్లా పోలీస్ కార్యాలయంలో అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన " ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు 113 అర్జీలను అందజేశారు. అదనపు ఎస్పీలు ఆర్.విజయ భాస్కర్‌రెడ్డి, జి.రామకృష్ణ, అనంతపురం డీఎస్పీ టివివి.ప్రతాప్‌లు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వారి సమస్యలను విని అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ సిఐ ఇందిర పాల్గొన్నారు.

ఎటిఎం సెంటర్లు, బ్యాంకుల వద్ద పటిష్ట భద్రత

జిల్లాలో ఇటీవల గార్లదిన్నె, అనంతపురం ఎటిఎం కేంద్రాల్లో దొంగతనాల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తం అయ్యారు. వీటిని తీవ్రంగా పరగణించిన ఎస్పీ కెవి.మురళీకృష్ణ ఎటిఎం కేంద్రాలు, బ్యాంకుల వద్ద పోలీసు భద్రతను పటిష్టం చేసేలా చర్యలు తీసుకున్నారు. చోరీలను ఛేదింపు కోసం ప్రత్యేక బందాలను రంగంలోకి దింపుతూనే, మరోవైపు ఈతరహా చోరీలు జరుగకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా ఎన్ని ఎటిఎం సెంటర్లు ఉన్నాయి, వాటి భద్రతపై సమీక్ష చేశారు. ఎటిఎంల వద్ద సెక్యూరిటీ గార్డులు, సిసి కెమెరాలు తప్పనిసరిగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు సంబంధిత పోలీసుల పర్యవేక్షణ తథ్యంగా భావించి ఆదిశగా చర్యలు చేపట్టారు. ఎస్ఐలు, సిఐలే కాకుండా డీఎస్పీలు సైతం రంగంలోకి దిగి అర్ధరాత్రి వేళ తనిఖీ చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా రాత్రి వేళ వాహనాల తనిఖీలు ముమ్మరం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లా మీదుగా వచ్చి, వెళ్లే వాహనాల వివరాలను తీసుకుంటున్నారు.

స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ప్రత్యేక రైళ్లు

రాయదుర్గం : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నైరుతి రైల్వే ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక రైలు సర్వీసులను నడపనున్నట్లు నైరుతి రైల్వే హుబ్లీ డివిజన్ ముఖ్య సమాచార అధికారి సురేష్ కనమడి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రైన్ నెంబర్ 06231 బెంగళూరులోని సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య టెర్మినల్ (ఎస్ఎంవిటి) నుంచి ఈనెల 14న రాత్రి 9 గంటలకు బయలుదేరి తుమకూరు, అరిసికేరే, బీరూరు, చిక్కజాజూరు, చిత్రదుర్గ, రాయదుర్గం, బళ్ళారి కంటోన్మెంట్, తోరనగల్లు హొసపేట, కొప్పల్, గదగ్ బాగల్కోట్ , బాదామి, ఆల్మట్టి మీదుగా విజయపుర 15న మధ్యాహ్నం 2-05 గంటలకు చేరుతుందన్నారు. ట్రైన్ నెంబర్ 06232 15న సాయంత్రం 7 గంటలకు విజయపుర నుంచి బయలుదేరి పై తెలిపిన మార్గంలోనే 16వ తేదీ ఉదయం 11-15 గంటలకు ఎస్ఎంవిటీ (బెంగళూరు) స్టేషన్ చేరుతుందన్నారు. ఈ మార్గంలోని ప్రయాణికులు ప్రత్యేక రైలు సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వయనాడ్ ప్రజలకు అండగా నిలుద్దాం

సిపిఎం ఆధ్వర్యంలో విరాళాల సేకరణ



అనంతపురంలో విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

కేరళ రాష్ట్రం వయనాడ్ వరద బాధితుల సహాయార్థం విరాళాలు అందజేసి అండగా నిలుద్దామని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. వయనాడ్ బాధితుల సహాయార్థం సిపిఎం ఆధ్వర్యంలో తపోవనం, నారాయణపురం సర్కిళ్లలో సోమవారం విరాళాలు సేకరించారు. ఇందులో భాగంగా వ్యాపార సముదాయాలు, తోపుడుబండ్లు, ఇంటింటికీ వెళ్లి విరాళాలను అభ్యర్థించారు. ఈ సందర్భంగా సిపిఎం నగర 1వ కమిటీ కార్యదర్శి వి.రామిరెడ్డి మాట్లాడుతూ ఎవరూ ఊహించని విపత్కర పరిస్థితుల్లో అందలాదిమంది ప్రజలు కొండ చర్యలు విరిగిపడి ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. వారందరికీ అండగా నిలవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, సిపిఎం నాయకులు ప్రకాష్‌రెడ్డి, వెంకటనారాయణ, రాజు, డివైఎఫ్ఐ బాలకృష్ణ, మున్సిపల్ యూనియన్ నాయకులు లక్ష్మీనారాయణ, నగర కార్యదర్శి రామిరెడ్డి, కెవిపిఎస్ వెంకటేష్, నూరుల్లా, మసూద్, డేవిడ్, ఫక్రు, రాము, వెంకటప్ప, సీనా, గఫూర్, జీవరత్నం, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుంతకల్లు : కేరళ రాష్ట్రం వయనాడ్ వరద బాధితులకు అండగా నిలుద్దామని శ్రీ శంకరానంద గిరి స్వామి డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌కె.నాయుడు, సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని సిపిఎం కార్యాలయం నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకూ వయనాడ్ వరద బాధితుల కోసం విరాళాల సేకరణ చేపట్టారు. ఇందులో భాగంగా ఆర్‌కె.నాయుడు తనవంతు సాయంగా రూ.10 వేల నగదు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయానాడ్‌లో కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనలో 350 మందికిపైగా మృత్యువాత పడటం బాధాకరమన్నారు. వందలాది మంది గాయాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. కొంతమంది జాడ కానరావడం లేదన్నారు. బాధిత ప్రజలకు జరిగిన నష్టం పూడ్చలేనిదన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ఎంత సహాయ, సహకారాలు అందించినప్పటికీ యావత్ భారత ప్రజానీకం అండగా నిలవాల్సిన సమయమన్నారు. విపత్తు వేళ కేరళలోని వయనాడ్‌కు ప్రజలంతా అండగా నిలవాలని ఇప్పటికే సిపిఐ(యం) ఆంధ్రప్రదేశ్ కమిటీ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించి బాధితులకు పంపాలని నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగానే జిల్లావ్యాప్తంగా ప్రజల వద్దకు వెళ్లి బాధితులకు సహాయార్థం విరాళాలు సేకరించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఉదారంగా విరాళాలిచ్చి సంఘీభావాన్ని చాటాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు మారుతీప్రసాద్, కసాపురం రమేష్, సాకే నాగరాజు, పట్టణ కమిటీ సభ్యులు రామునాయక్, సురేంద్ర, షబ్బీర్, తిమ్మప్ప, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : కేరళ రాష్ట్రంలోని వాయనాడ్ జిల్లా వరదల బాధితుల సహాయార్థం సోమవారం మండల పరిధిలోని కడవకల్లు గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో మండలంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ కేరళ రాష్ట్రం వయనాడ్‌లో ఇటీవల వరదల కారనంగా కొండ చరియలు విరిగి పడి చర్యలు దాదాపు 300 మంది చనిపోవడం, 200 మంది గల్లంతైన విషయం తెలిసిందే అన్నారు. దీనికితోడు వందలాదిమంది నిరాశయులుగా మారారన్నారు. వరద బాధితుల సహాయార్థం మండల కమిటీ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.సూరి, రైతుసంఘం మండల కార్యదర్శి జి.వెంకటచౌదరి, నాయకులు టి.పెద్దయ్య, భాస్కర్‌రెడ్డి, కె.నాగభూషణం, జె.పెద్దయ్య, కుళ్లాయప్ప, కాటం ఆదెప్ప, తదితరులు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : కేరళ బాధిత కుటుంబాల సహాయార్థం సిపిఎం ఆధ్వర్యంలో పట్టణంలోని ఎన్‌జిఒ హోం వద్ద సోమవారం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కేరళ సహాయ నిధి సేకరించి పంపాలని సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విరాళాల సేకరణ చేపట్టినట్లు తెలిపారు. కావున ప్రజలు ప్రజలు విరివిగా విరాళాలు అందజేయాలని కోరారు. అలాగే ఆన్‌లైన్ ద్వారా కూడా విరాళాలు ఇవ్వవచ్చున్నారు. రిలీఫ్ ఫండ్‌కు డబ్బు పంపేవారు సిపిఐ(యం) పీపుల్స్ రిలీఫ్ ఫండ్ అయితే ఖాతా నెంబర్ 62109192143 (స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) ఐఎఫ్ఎస్‌సి కోడ్ ఎస్‌బిఐఎన్ 0020343కు పంపవచ్చున్నారు. విరాళాలు విరాళం పంపిన తర్వాత సమాచారాన్ని సెల్..94900 99018కు, ఈమెయిల్ ap@cpim.orgకు పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు హనుమంత రెడ్డి, రామ్మోహన్, నాగరాజు, శ్రీరాములు ,కుళ్లాయప్ప, శివ, మహమ్మద్, ఆంజనేయులు పాల్గొన్నారు.

తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన అవసరం

ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి

ప్రజాశక్తి-అనంతపురం

తల్లిపాల ప్రాధాన్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి సూచించారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన అవగాహన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతంలా పని చేస్తాయన్నారు. పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లి ముర్రుపాలు పట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ అవార్డు గ్రహీత బిసాటి భరత్, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు బిసాటి జీవన్‌కుమార్, కె.జయమారుతి, డిసిపిఒ మంజునాథ, ఎన్ఎస్ఎస్ రాష్ట్రస్థాయి అవార్డు గ్రహీత జి.నందిత, ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీ, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సభ్యులు రాజా, వై.పవన్ దోని, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : తల్లిపాల ప్రాధాన్యతపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని సూపర్‌వైజర్ మాలిని మధు తెలిపారు. సోమవారం మండలంలోని సిద్దిరాచర్ల పంచాయతీ పరిధిలోని దుర్గం అంగన్వాడీ కేంద్రంలో సిడిపిఒ భారతి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు తల్లిపాల ప్రాముఖ్యతపై పూర్తి అవగాహనతో ఉండాలన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ బిడ్డలకు తల్లిపాలనే పట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు తృణీత, పెద్దక్క, బాలమ్మ, గర్భిణులు, చిన్నపిల్లల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సిడిపిఒ భారతి ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని అంగన్వాడీ-3లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శాంతమ్మ ముర్రుపాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం ఐశ్వర్య, సెక్టార్ అంగన్వాడీ వర్కర్లు, ఆశావర్కర్లు, ఐఆర్‌టి వాణి, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : స్థానిక దుర్గమ్మ వీధిలో ఉన్న అంగన్వాడీ సెంటర్-2లో అంగన్వాడీ నారాయణమ్మ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ అసిస్టెంట్లు రవికుమార్, చంద్రశేఖర్‌రెడ్డి తల్లిపాల ఆవశ్యకత గురించిపై వివరించారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం ఉమాదేవి, అంగన్వాడీ హెల్పర్ లక్ష్మీదేవి, ఆశాలు వసంతకుమారి, పద్మావతి, చంద్రవేణి, మాబున్నీ, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి దాసరి సునీత అధ్యక్షతన సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. తర్వాత తల్లిపాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీదేవి, సిడిపిఒ ఉమాశర్మ, ఇఒఆర్‌డి దామోదరమ్మ, ఎఒ శ్రీవాణి, అంగన్వాడీ సూపర్‌వైజర్ నాగమణి, హేమలత, అన్నపూర్ణ, అంగన్వాడీ టీచర్లు, గర్భిణులు, తదితరులు పాల్గొన్నారు.



పెద్దపప్పూరు మండలంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ సిబ్బంది

పెద్దపప్పూరు : మండల పరిధిలోని ముచ్చుకోట, పెద్దయక్కలూరు గ్రామాల్లో ఐసిడిసి సూపర్‌వైజర్లు డి.నారాయణమ్మ, రామలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లి ముర్రుపాలు బిడ్డకు సర్వరోగ నివారణిలా పని చేస్తాయన్నారు. కావున ప్రతి ఒక్కరూ పుట్టిన వెంటనే బిడ్డలకు ముర్రుపాలు పట్టించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

పాలనలో 'బాబు' మార్క్

అనంతపురం కలెక్టరేట్ : పాలన అంటే ఏంటో అప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు తన ముద్ర వేసుకుంటున్నారని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగానే సోమవారం నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో ప్రతినెలా ఒకటో తేదీన 'పేదల సేవలో' అనే కార్యక్రమం తీసుకొచ్చారన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇలాంటి ఆలోచన చేయలేదన్నారు. మరోవైపు సూపర్-6 హామీలకు కట్టుబడి ఉన్నామని మరోసారి చంద్రబాబు స్పష్టం చేశారన్నారు.

జీవో 117ను రద్దు చేసే వరకు 'సర్దుబాటు' ఆపాలి

అనంతపురం కలెక్టరేట్ : జీవో 117ను రద్దు చేసేంత వరకూ ఉపాధ్యాయుల పని సర్దుబాటును నిలిపివేయాలని ఎపిటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి బి.నరసింహులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్ డిమాండ్ చేశారు. సోమవారం రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగానికి నష్టం కలిగించే జీవో 117ను వెంటనే రద్దు చేయాలన్నారు. పాఠశాలల మూసివేత నిర్ణయాన్ని ఏపిటిఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటును గతంలో మండల జిల్లా స్థాయిలో స్థానికంగా అవసరాన్ని బట్టి చేసేవారని ప్రస్తుతం రాష్ట్రస్థాయిలో ఆన్‌లైన్ విధానంలో చేస్తామనడం గందరగోళానికి దారితీస్తోందన్నారు. విద్యాశాఖకు సంబంధించిన నిర్ణయాలు తీసుకునే ముందు ఉపాధ్యాయ సంఘాలతో చర్చించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిటిఎఫ్ నాయకులు ఓబులేసు, ఆంజనేయులు, కదిరప్ప, తదితరులు పాల్గొన్నారు.

డిజిహెచ్ఎస్ఎస్ కమిటీ ఎన్నిక

వజ్రకరూరు : ఉరవకొండ నియోజకవర్గ దళిత గిరిజనుల హక్కుల సాధన సమితి (డిజిహెచ్ఎస్ఎస్) నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘం వ్యవస్థాపకులు గోపాల్ తెలిపారు. డిజిహెచ్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మీనుగ గోపాల్ అధ్యక్షతన సోమవారం ఉరవకొండలోని హరిజన హాస్టల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవాధ్యక్షులుగా ఇంద్రావతి, తలారి గంగాధర్, నియోజకవర్గ అధ్యక్షుడిగా హెగ్గడి కుమార్, ఉపాధ్యక్షులుగా జి.సురేష్, ప్రధాన కార్యదర్శి ఎం.కిరణ్, కార్యదర్శిగా శ్రీకాంత్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎస్.నరసింహులు, ట్రెజరర్‌గా ఎస్.ప్రభాకర్, అధికార ప్రతినిధులుగా జి.నాగరాజు, హెచ్.ఎర్రిస్వామి, కార్యవర్గ సభ్యులుగా ఎస్.నెట్టికల్లు, వై.వన్నూరుస్వామిని ఎన్నుకున్నారు. ఈమేరకు నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో లత్తవరం చంద్రశేఖర్, నింబగల్ అంగడి రాము, తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాం పంపిణీ

బెలుగుప్ప : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 71 మంది విద్యార్థులకు సోమవారం ప్రభుత్వం అందించిన యూనిఫారను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానో ఉపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు చంద్రకళ, బిజెపి, టిడిపి నాయకులు తిప్పేస్వామి, బైనే నారాయణస్వామి, అంగడి శ్రీరాములు, శివ, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలి

వజ్రకరూరు : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని, హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించాలని ఆర్ఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి చిరంజీవి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం ఉరవకొండ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలని, హాస్టళ్లలో పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్ ఛార్జీలను విడుదల చేయడంతోపాటు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌యుఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు జగదీష్, భరత్, లోకేష్, సిసిందర్, వైఎస్ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, ఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కార్యదర్శి భీమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల యజమానులపై చర్యకు డిమాండ్

గుంతకల్లు : తక్కువ కొలతలతో పెట్రోల్, డీజిల్ విక్రయిస్తున్న పెట్రోల్ బంకుల యజమానులపై చర్యలు తీసుకోవాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కమిటీ కార్యదర్శి బి.సురేష్ ఆధ్వర్యంలో ఆర్‌డిఒ శ్రీనివాసులురెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గుంతకల్ డివిజన్ కమిటీ సభ్యులు రఘునాథరెడ్డి, జిలాన్, బాషా, గోపీ, విశ్వనాథ్, రాందాస్, ఆటో గోపీ, భరత్, తదితరులు పాల్గొన్నారు.

'అమూల్' వల్ల నష్టపోతున్న రైతులను ఆదుకోవాలి

డిఆర్ఒకు ఎపి రైతుసంఘం నాయకుల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అమూల్ డెయిరీ సంస్థ వల్ల తీవ్రంగా నష్టపోతున్న పాడి రైతులను ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిఆర్ఒ రామకృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమూల్ డెయిరీ సంస్థ యూనిట్లలో పాలు కొనుగోలు చేయమని ఏజెంట్లు, పాడి రైతులకు యాజమాన్యం సమాచారం ఇవ్వడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. వర్షాలు రాక కరువుతో కష్టాల్లో కోరుకుపోయిన రైతాంగానికి పాడి పరిశ్రమ మీద ఆధారపడి అనేక కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయన్నారు. ఈక్రమంలో అమూల్ సంస్థ తీసుకున్న నిర్ణయం పాడి రైతులను తీవ్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. పాడి రైతులను రాష్ట్ర ప్రభుత్వం విజయ డెయిరీ ద్వారా పాడి రైతుల నుంచి పాలు కొనుగోలు చేసి జీవనోపాధిని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం నాయకులు పోతులయ్య, రవీంద్ర, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

మాంసం విక్రయశాలను ఊరి బయటికి తరలించాలి

కమిషనర్‌కు సిపిఎం నాయకుల వినతి

ప్రజాశక్తి-రాయదుర్గం



వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

పట్టణంలోని దాసప్ప రోడ్డు వద్ద ఉన్న మటన్, చికెన్ మాంసం విక్రయ దుకాణాలను పట్టణం వెలుపలకు తరలించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం మటన్ మార్కెట్ ఉన్న దాసప్ప రోడ్డు నిత్యం రద్దీగా ఉంటోందన్నారు. దీంతో మార్గంలో వెళ్లే విద్యార్థులు, మహిళలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేకాక మార్కెట్‌లో రోడ్డుపైనే చికెన్, మటన్ విక్రయాలు నిర్వహిస్తూ దోమలు, ఈగలు అపరిశుభ్ర వాతావరణం నెలకొందన్నారు. ఆధునిక ఎలక్ట్రానిక్ తూనిక పరికరాలు ఉపయోగించాల్సి ఉండగా, నేటికీ తక్కెడ రాళ్లతో మాంసం, చికెన్ విక్రయిస్తూ కొనుగోలుదారులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్, పశు వైద్య అధికారులు మార్కెట్‌ను తనిఖీ చేసిన పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తూ అపరిశుభ్ర వాతావరణంలో ఉన్న చికెన్, మటన్ మార్కెట్‌ను పట్టణం వెలుపలకు తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మల్లికార్జున, నాగరాజు, మధు, తదితరులు పాల్గొన్నారు.

19న రంగనాథుడి కల్యాణం

ప్రజాశక్తి-గుత్తి


గ్రామస్తులకు లగ్నపత్రికను అందజేస్తున్న అర్చకులు

మండలంలోని జక్కల చెరువు గ్రామంలో వెలసిన బొలికొండ రంగనాథ స్వామి కల్యాణం ఈనెల 19న నిర్వహించేందుకు ఆలయ అధికారి, అర్చకులు నిర్ణయించారు. ఈమేరకు సోమవారం గ్రామంలోని రంగనాథస్వామి ఆలయంలో ప్రత్యేకంగా పూజలు చేసి కల్యాణ లగ్నాన్ని నిర్ణయించారు. ఆలయ ఈఓ నాగేంద్రుడు, గ్రామ పెద్దలు,ప్రజలతో ఆలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి కల్యాణం నిర్వహించే తేదీలపై చర్చించారు. శ్రావణ పౌర్ణమి సందర్భంగా ప్రతిఏడాది నిర్వహించే కల్యాణాన్ని ఈ నెల 19న సోమవారం ఉదయం 11.45 గంటలకు స్వామి కళ్యాణం నిర్వహించే విధంగా లగ్నపత్రిక రాసి అర్చకులు సతీష్, రవికుమార్, ఆలయ ఈఓ నాగేంద్రుడు, ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో జక్కలచెరువు గ్రామ ప్రజల సమ్మతితో లగ్నపత్రిక ఖరారు చేసి జక్కలచెరువు గ్రామస్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి జింకల నారాయణస్వామి, మాజీ సర్పంచి లక్ష్మీనారాయణమ్మ, సూర్యప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ బాలికల కళాశాల హాస్టల్ ఏర్పాటు చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్

ప్రజాశక్తి-గుత్తి



వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్సీ కళాశాల విద్యార్థినుల సౌకర్యార్థం ప్రభుత్వ వసతి గృహాన్ని ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు సాంఘిక సంక్షేమశాఖ డివిజన్ సహాయ అధికారిణి రాధికకు సోమవారం ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుత్తిలో ఉన్న బాలికల కళాశాలకు ఉరవకొండ, విడపనకల్లు, చిప్పగిరి, గుంతకల్లు, పత్తికొండ, ప్యాపిలి, పెద్దవడుగూరు, పామిడి, గుత్తి, తదితర మండలాల నుంచి విద్యార్థినులు విద్యను అభ్యసించేందుకు వస్తుంటారన్నారు. వీరందరికీ మండల కేంద్రంలో ఉన్న బీసీ హాస్టల్‌లో భవనం సరిపోవడం లేదన్నారు. తద్వారా నూతనంగా కళాశాలలోకి ప్రవేశించే విద్యార్థినులకు వసతి లభించడం లేదన్నారు. చాలా మంది విద్యార్థినులు హాస్టల్ వసతి లేక టీసీలు వెనక్కి తీసుకుని చదువులకు దూరం అవుతున్నారన్నారు. కావున వెంటనే ఎస్సీ కళాశాల బాలికల వసతి గృహాన్ని కళాశాల పరిసర ప్రాంతాల్లోనే నూతన భవనం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రవీంద్ర, నవీన్, బాలు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం : ఎమ్మెల్యే

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం


కేక్ కోస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే అమిలినేని జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ముందుగా పట్టణంలోని స్వగృహంలో వేదపండితుల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేక్ కోసి పంచిపెట్టారు. డిగ్రీ కళాశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగలకు ఉచితంగా కోచింగ్ ఇస్తున్న అభయ ఫౌండేషన్‌కు తన మొదటి వేతనాన్ని విరాళంగా అందజేశారు. ఇకపోతే మదీనా మసీదు వద్ద కేక్ కోసం సంబరాలు చేసుకున్నారు. ప్రజావేదిక వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, కరణం రామ్మోహన్‌చౌదరి, లక్ష్మీనారాయణ, పాపంపల్లి రామాంజనేయులు, వైపి రమేష్, దండా వెంకటేశులు, తదితరులు పాల్గొన్నారు.

ఆహార పదార్థాల ఉత్సవం


ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ రఘురామమూర్తి

రాయదుర్గం రూరల్ : స్థానిక కెటిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సూక్ష్మ జీవశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఇండోర్ స్టేడియంలో మైక్రో బయాలజీ విద్యార్థులు ఆహార పదార్థాల ఉత్సవం నిర్వహించారు. ఇందులో దాదాపు 100 రకాల ఆహార పదార్థాలను విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించారు. ఆయా వంటకాలను ప్రిన్సిపాల్ రఘురామమూర్తి పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, మైక్రో బయాలజీ అధ్యాపకులు కిరణ్, గోవర్ధన్, ఎన్‌సిసి కోఆర్డినేటర్ కిరణ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో రాయదుర్గం విద్యార్థిని ప్రతిభ

రాయదుర్గం : ఇటీవల హిందూపురంలోని ఆవాస విద్యాలయంలో ఉమ్మడి అనంతపురం జిల్లా ఆటల పోటీల్లో రాయదుర్గంలోని సరస్వతి శిశు మందిర్‌కు చెందిన విద్యార్థిని కురుబ ఆశ్రిత షాట్‌పుట్‌లో ప్రథమ స్థానం సాధించింది. దీంతో నిర్వాహకులు మొమెంటోను ప్రదానం చేశారు. జిల్లాస్థాయిలో క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడం పట్ల ఆశ్రితను పాఠశాల కమిటీ అధ్యక్షులు ధనార్ధన, ప్రధాన ఆచార్యులు రాజేశ్వరి, ఉపాధ్యాయులు మహాదేవి, చంద్రకళ, పాఠశాల కమిటీ కార్యదర్శి తుకారాం కోశాధికారి సాంబమూర్తి, తదితరులు అభినందించారు.


ప్రతిభ కనబరిచిన ఆశ్రిత

తహశీల్దార్ల బాధ్యతల స్వీకరణ


హరికుమార్

అనంతపురం సిటీ : జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో తహశీల్దార్లు పదవీ బాధ్యతలు స్వీకరించారు. సాధారణ ఎన్నికల అనంతరం ఇతర జిల్లా నుంచి వచ్చిన తహశీల్దార్లు ఎవరికి కేటాయించిన వారి మండలాల్లో వారు బాధ్యతలు చేపట్టారు. ఇందులో భాగంగా అనంతపురం అర్బన్ తహశీల్దార్‌గా హరికుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు బొకేలు అందజేసి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.


ఎస్.బ్రహ్మయ్య

శింగనమల : మండల తహశీల్దార్‌గా సాకే బ్రహ్మయ్య సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్‌రావు, సీనియర్ అసిస్టెంట్ వెంకట్రామిరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్‌రావు, సీనరీస్ టెన్త్ వెంకటరామిరెడ్డి, ఎన్నికల డిటి రామకృష్ణ, మండల సర్వేయర్ గోవిందరాజులు, ఆర్ఐ హనుమాన్ ప్రసాద్, వీఆర్వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు


బి.ఈరమ్మ

గార్లదిన్నె : మండల తహశీల్దార్‌గా బి.ఈరమ్మ సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.అనంతరం రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, పలువురు ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.


పుణ్యవతి

బుక్కరాయసముద్రం : నూతన తహశీల్దార్‌గా పుణ్యవతి సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక కార్యాలయ సిబ్బంది బొకేలు అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ గతంలో ఇక్కడ సిఎస్‌డిటిగా పని చేసిన అనుభవం ఉందని, ఆ అనుభవంతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తానని తెలిపారు.


శేషారెడ్డి

పుట్లూరు : మండల తహశీల్దార్‌గా శేషారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కూడేరు మండల తహశీల్దార్‌గా పనిచేస్తూ ఎన్నికల బదిలీ నిమిత్తం కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు బదిలీపై వెళ్లారు. తిరిగి జిల్లాకు రావడంతో మండల తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది బొకేలు అందజేసి స్వాగతం పలికారు.


అరుణకుమారి

నార్పల : మండల నూతన తహశీల్దార్‌గా అరుణకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనరంహులు ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అందరి సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.


బాలాజీరాజ్

పెద్దపప్పూరు : మండల తహశీల్దార్‌గా బాలాజీరాజ్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.


ఎస్.మహబూబ్‌బాషా

వజ్రకరూరు : ఉరవకొండ తహశీల్దార్‌గా ఎస్.మహబూబ్‌బాషా సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో ఎంపిడిఒ సుబ్బరాజు, కాంగ్రెస్ నాయకులు ఇంద్రావతి ఓబులేసు, పోసా రాము, శ్రీకాంత్ వర్మ, తదితరులు ఉన్నారు.


ఎస్.రమాదేవి

గుంతకల్లు : నూతన తహశీల్దార్‌గా ఎస్.రమాదేవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో బుక్కరాయసముద్రం తహశీల్దార్‌గా పని చేస్తున్న ఆమె ఎన్నికల విధుల్లో భాగంగా మదనపల్లికి బదిలీ అయ్యారు. తిరిగి జిల్లాకు బదిలీ చేయడంతో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, స్టోరు డీలర్లు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్లు ఆదినారాయణ, సుబ్బలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


హెచ్.ఓబులేసు

గుత్తి : నూతన తహశీల్దార్‌గా హెచ్.ఓబిలేసు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న బి.భారతి బదిలీపై వెళ్లగా బెలుగుప్పలో విధులు నిర్వహిస్తున్న ఓబిలేసు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఉప తహశీల్దార్లు లలిత, శ్రీలత, మండల రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ సందీప్, వివిధ శాఖ అధికారులు, వీఆర్వోలు, వీఆర్ఏలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు చెప్పారు.


ఆర్.సుమతి

బ్రహ్మసముద్రం : మండల నూతన తహశీల్దార్‌గా ఆర్.సుమతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ శ్రీనాథ్ బొకే అందజేసి స్వాగతం పలికారు. అనంతరం రెవెన్యూ అధికారులు, ప్రజాప్రతినిధులు, పలువురు ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

బొమ్మనహాళ్ : మండలంలోని రెవెన్యూ కార్యాలయంలో నూతన తహశీల్దార్ సి.మునివేలు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దార్ సుజాత, ఆర్ఐ బాలకృష్ణ, వీఆర్వోలు యుగంధర్, నరసింహమూర్తి, రామన్న, సుజాత, కుళ్లాయిస్వామి, రవి, శృతి, తిమ్మప్ప, తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు.

ఆత్మకూరు : మండల నూతన తహశీల్దార్‌గా లక్ష్మీనాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది పూలమాల వేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బోదపాటి హరి, ఉపేందర్‌చౌదరి, సర్దాని, గుజ్జుల శేఖర, దళిత నాయకులు, స్టోర్ డీలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఆత్మకూరులో తహశీల్దార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

వార్డు వెల్ఫేర్ సెక్రటరీల నియామకం

అనంతపురం కార్పొరేషన్ : బీకాం విద్యార్హతగా కలిగిన 12 మంది వార్డు వెల్ఫేర్ సెక్రటరీలకు మున్సిపల్ కమిషనర్ పివివిఎస్.మూర్తి సోమవారం స్థానిక కార్యాలయంలో నియామకపత్రాలు అందజేశారు. గతంలో బీకాం విద్యార్థులు అర్హులు కాదన్న అంశంపై కోర్టుకెళ్లిన 12 మందికి కోర్టు ఆదేశాల మేరకు రెండు రోజుల క్రితం ఇంటర్వ్యూలు నిర్వహించారు. వారందరికీ నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ హరిబాబు, రెవెన్యూ ఆఫీసర్ సతీష్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ రమ్య, తదితరులు పాల్గొన్నారు

తహశీల్దార్‌ను కలిసిన నాయకులు


తహశీల్దార్‌కు బొకే అందజేస్తున్న టిడిపి నాయకులు

శింగనమల : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్ ఎస్.బ్రహ్మయ్యను మండలంలోని టిడిపి నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు సమస్యలను తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ, నాయకులు చిదానందనాయుడు, గుర్రం లక్ష్మీనారాయణ, కాయల రమణయాదవ్, మండల గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి మసూద్‌వలి, డ్రిప్పు ఓబులేస్, మాసూల చంద్రమోహన్, అట్టే శ్రీనివాసులు, చెన్నయ్య, రామన్నయాదవ్, ఫక్రుద్దీన్, పుల్లయ్య, రమేష్, తిరుపాలు, ప్రతాప్, సుంకయ్య, రాముడు, పేట బయన్న, బాలముని, శ్రీనివాసులు, ప్రకాష్, శంకర, గుర్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు చేయూతనివ్వాలని వినతి

పామిడి : మండలంలోని వికలాంగులకు చేయూత ఇవ్వాలని విశాల్ ఫెడ్రర్ వికలాంగుల మండల సమైక్య సభ్యులు కోరారు. ఈమేరకు సోమవారం మండల కేంద్రంలోని కార్యాలయంలో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగులకు నివాస స్థలం 3 సెంట్ల స్థలం కేటాయించి వికలాంగుల కాలనీ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే వికలాంగులకు మనోధైర్యం కల్పించి సమాజంలో అన్ని రంగాలలో ప్రముఖ స్థానం కల్పించాలని కోరారు. ఇందుకు తహశీల్దార్ స్పందిస్తూ సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం తహశీల్దార్‌ను పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేశవాచారి, అప్పన్నగారి కుమార్, సర్వేస్, మల్లికార్జున, ప్రకాష్, విశాల వికలాంగుల మండల సమైక్య సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

పెన్నులు, పుస్తకాలు వితరణ

బ్రహ్మసముద్రం : ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని టిడిపి మండల కన్వీనర్ పాలకొండ శ్రీరాములు సోమవారం మండల పరిధిలోని పాలవెంకటాపురం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పెన్నులను, పాఠ్యపుస్తకాలను వితరణ చేసినట్లు ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలకు సిద్ధం

అనంతపురం : రెడ్ల హక్కుల సాధన, అభివృద్ధి కోసం పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంగులకుంట నరేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సోమవారం నగరంలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రెడ్లకు చేసిందేమీ లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందన్నారు. రెడ్ల కార్పొరేషన్ నిధులు, ఇతరత్రా వాటిపై పార్టీలకు అతీతంగా కలిసి రావాలని కోరారు. రెడ్ల ఉద్యోగులు తప్పు చేసింటే చర్యలు తీసుకోవాలని, లేకుంటే వేధించవద్దన్నారు.

వేరుశనగ పొలాల పరిశీలన

రాయదుర్గం రూరల్ : మండల పరిధిలోని రాతిబావివంకలో రైతులు సాగు చేసిన వేరుశనగ పొలాలను రాయదుర్గం ఎడిఎ లక్ష్మానాయక్ సోమవారం పరిశీలించారు. ఇందులో భాగంగా పంట పొలాల్లో మొవ్వకుల్లు తెగులు అధికంగా ఉండడాన్ని గుర్తించి నివారణకు మందులు వాడాలని సూచించారు. కాగా ఈపంట నమోదును త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాయదుర్గం మండల వ్యవసాయ అధికారి మహేంద్ర, రైతులు పాల్గొన్నారు.

వాల్మీకి సేవా సమితికి సిద్ధప్ప రాజీనామా

రాయదుర్గం : రాయదుర్గం తాలూకా వాల్మీకి సంక్షేమ సేవా సమితి కార్యదర్శి పదవికి రాజీనామా చేసినట్లు ఎన్‌టీ.శిద్ధప్ప సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనకు 80ఏళ్ల వయసు పైబడినందున సమితి కార్యక్రమాల్లో చురుగ్గా పని చేయలేకపోతున్నానన్నారు. కావున సమితి కార్యవర్గం తన రాజీనామాను ఆమోదించాలని కోరారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను సమితి అధ్యక్షులు బండి కిష్టప్పకు పంపినట్లు తెలిపారు.

తప్పిపోయిన వ్యక్తి పోలీసులకు అప్పగింత

గుత్తి : పట్టణంలోని స్వస్థతశాలకు వచ్చి తప్పిపోయిన ఓ మతిస్థిమితం లేని వ్యక్తిని సోమవారం ఆటో డ్రైవర్లు పోలీసులకు అప్పగించారు. పోలీసులు కర్నూలు జిల్లా క్రిష్ణగిరి మండలం తిగరచేడు గ్రామానికి చెందిన కె.కృష్ణమూర్తిగా గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నబిరసూల్, హెడ్ కానిస్టేబుల్ హనుమంతు, ఆటో డ్రైవర్ నజీర్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వికలాంగుడు ఆత్మహత్య


రాము (పాతచిత్రం)

గుత్తి : కాళ్లు బలహీనంగా ఉండి స్వతహాగా పని చేసుకోలేక పోతున్నానని మానసికంగా కుంగిపోయిన ఓ వికలాంగుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం మండలంలోని తురకపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వికలాంగుడు రాము (45) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఎదురుగా చిల్లర దుకాణం ఏర్పాటు చేసుకుని జీవనం కొనసాగించేవాడు. గతంలో అతని కాళ్లకు శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. అప్పటి నుంచి కాళ్లు బలహీనంగా ఉన్నాయని తన పని చేసుకోవడానికి కుటుంబ సభ్యులపై ఆధారపడేవాడు. దీంతో మానసిక క్షోభకు గురైన అతడు సోమవారం మధ్యాహ్నం తన భార్యను దుకాణంలో ఉంచి భోజనం చేసి వస్తానని ఇంటికి వెళ్లి సూసైడ్ నోట్ రాసి పై కప్పునకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై పోలీసుల కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పుట్లూరు : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ మహిళ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సోమవారం మృతిచెందింది. వివరాల్లోకి వెళ్తే.. తాడిపత్రికి చెందిన సుబ్బమ్మ (65) తన కొడుకు వంటిపులి వెంకటరమణతో కలిసి ద్విచక్ర వాహనంలో ఆదివారం పుట్లూరు వచ్చింది. పని ముగించుకుని తిగిరి తాడిపత్రికి వెళ్తుండగా స్థానిక పెట్రోల్ బంకు సమీపంలో వాహనం అదుపుతప్పి కింద పడటంతో సుబ్బమ్మ తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందింది. మృతురాలి పెద్దకొడుకు వంటిపులి నాగేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి : మండలంలోని బాచుపల్లి గ్రామ శివారులో రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఆదివారం రాత్రి ఆటో ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాయదుర్గంకు చెందిన బాషా బాచుపల్లి గ్రామ శివారులోని బాటసుంకులమ్మ ఆలయం సమీపంలో డాబా వద్దకు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్నాడు. అయితే గుత్తి వైపునకు వెళ్తున్న ఆటో వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బాషాను వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనం ద్వారా గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురంకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

టిడిపి కార్యకర్తలపై దాడి

పుట్లూరు : మండలంలోని కోమటికుంట్ల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త తాజ్‌పై ఆదివారం రాత్రి గుర్తు తెలియని దండుగులు దాడి చేశారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. తాడిపత్రి ఆర్డీటీ కాలనీ సమీపంలో ఆదివారం రాత్రి ఉన్నట్టుండి గుర్తు తెలియని వ్యక్తులు దాడికి పాల్పడ్డారన్నారు. దీంతో తాజ్‌కు స్వల్ప గాయాలయ్యాయి.